ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 19 అక్టోబరు 2024


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

రైతులకు ఇబ్బందులు
తలెత్తకుండా చూడాలి
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

8


దీక్షలో కూర్చున్న తాజా మాజీ సర్పంచులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
- విడుదల చేసే వరకు దీక్షలు
- తాజా మాజీ సర్పంచులు
- జేఏసీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభం

7

న్యూస్ బాక్స్

సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా బాధ్యతలు చేపట్టిన పసుల కృష్ణ

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన పసుల కృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాజన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏజీపీ గంట అంజయ్య ఉన్నారు.

పాలమూరు యునివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా కొత్తపల్లివాసి

గంభీరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : గంభీరావుపేట మండలం కొత్తపలి కి చెందిన జీఎన్ శ్రీనివాస్‌యాదవ్ పాలమూరు యునివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియామకమయ్యారు. శ్రీనివాస్ యునివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ఎంపికవడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

చందుర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మండల విద్యాధికారి వినయ్ కుమార్ అన్నారు. చందుర్తి మండలం సనుగుల ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు తనిఖీ చేసి, ఉపాధ్యాయుల బోధనతీరును విద్యార్థుల పఠనాశక్తిని తరగతి గదుల్లోకి వెళ్లి పరిశీలించి, తగు సలహాలు సూచనలు చేశారు. విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరు అయ్యేలా ఉపాధ్యాయులు విద్యార్థులను మోటివేట్ చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కటుకూరి ముఖేష్, ఉపాధ్యాయులు న్యాతరి నాగమణి, చింతల హరిష్మ ఉన్నారు.

గుంతలు పూడ్చిన గ్రామస్థులు

కోనరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని కల్వర్టు వరద ఉధృతికి గుంతలమయంగా మారి వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి మండల కేంద్రంలోని దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్థులు కంకర, సిమెంట్‌తో పూడ్చివేశారు.

తెల్ల బంగారంపై ఆశలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

- జిల్లాలో ఐదు సీసీఐ కొనుగోలు కేంద్రాలు
- క్వింటాల్ పత్తికి మద్దతు ధర రూ.7521
- జిల్లాలో 49,332 ఎకరాల్లో పత్తి సాగు
- అధిక వర్షాలతో దిగుబడిపై ప్రభావం

పత్తి దిగుబడిపై అన్నదాతలు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఏటా పంట సాగులో ఎన్ని కష్టాలు వచ్చినా పత్తివైపే మొగ్గు చూపుతున్నారు. ఈ సారి సీజన్‌లో అధిక వర్షాలతో ఇబ్బందులు పడినా దిగుబడి ఆశాజనకంగా వస్తుందని నమ్మకంగా ఉన్నారు. జిల్లాలో పలు చోట్ల రైతులు పత్తి ఏరడం ప్రారంభించారు. దీనికి అనుగుణంగానే అధికారులు పత్తి కొనుగోలుకు సన్నాహాలు చేశారు. జిల్లాలో సీసీఐ ద్వారా ఐదు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఈ నెల 8న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కోనరావుపేట మండలం సుద్దాలలోని కావేరి కాటన్ ఇండస్ట్రీస్, వేములవాడ మండలం నాంపల్లిలో లక్ష్మీనర్సింహా, సంకెపల్లిలోని లక్ష్మీ కాటన్, గొల్లపల్లిలోని సప్తగిరి, బోయినపల్లి మండలం తాళ్లపల్లిలో సీసీఐ ద్వారా కొనుగోళ్లను చేపట్టనున్నారు. జిన్నింగ్ మిల్లులోనే ఏటా కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. రైతులకు సీసీఐ క్వింటాలుకు 7521 మద్దతు ధరను నిర్ణయించింది. గతంలో బహిరంగ మార్కెట్‌లో పత్తికి ఎక్కువ ధర పలకడంతో రైతులు నేరుగా వ్యాపారులకు అమ్ముకున్నారు. ధర పెరుగుతుందని భావించి ఇళ్లలోనే నిల్వ ఉంచుకున్న రైతులు మళ్లీ ధర తక్కువ చేసి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తేమ శాతం ఆధారంగా మద్దతు ధర

సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని అమ్ముకునే రైతులకు తేమ శాతం ఆధారంగా మద్దతు ధర లభించనుంది. నిబంధనల ప్రకారం 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 ఉన్నపట్టికి 8శాతం లోపు తేమ ఉంటేనే పూర్తి స్థాయి మద్దతు ధర లభిస్తుంది. తేమ శాతం పెరిగిన కొద్దీ ధర తగ్గుతుంది. 9 శాతం తేమ ఉంటే రూ.7445.79 వరకు, 10 శాతం ఉంటే 7370.58 వరకు, 11 శాతం ఉంటే 7295.37 వరకు, 12 శాతం ఉంటే 7220.16 వరకు చెల్లించనున్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను ఇటీవలనే సవరించింది. గతేదాది మధ్య రకం పత్తి క్వింటాల్‌కు రూ.6620, పొడవు రకం రూ.7020 ఉంది. ఈ సారి మధ్య రకం రూ.7121, పొడవు రకం రూ.7521కి పెంచింది. గతేదాది కంటే క్వింటాల్‌కు మద్దతు ధర రూ.501 పెరిగింది.

జిల్లాలో 49,392 ఎకరాల్లో పత్తి సాగు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా పత్తి 49,332 ఎకరాల్లో సాగు చేశారు. గంభీరావుపేటలో 220 ఎకరాలు, ఇల్లంతకుంట 12,412 ఎకరాలు, ముస్తాబాద్ 760, సిరిసిల్ల 720, తంగళ్లపల్లి 1300, వీర్నపల్లి 514, ఎల్లారెడ్డిపేట 3900, వేములవాడ 5100, వేములవాడ రూరల్‌లో 3950 ఎకరాల్లో పత్తి పంట వేశారు. అధిక వర్షాలతో పంటకు నష్టం వాటిల్లింది. పత్తి ఎర్రబారడం, కలుపు, పూత, కాత దశలో రైతులు ఇబ్బందులు పడ్డారు.



ఆధార్ తప్పనిసరి..

సీసీఐ పత్తి విక్రయించే కేంద్రాల్లో రైతుల బయోమెట్రిక్ తీసుకోనున్నారు. పత్తి కొనుగోళ్లలో అక్రమాలు తలెత్తకుండా ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. రైతుల బయోమెట్రిక్ తీసుకొని ఆధార్ కార్డు మ్యాపింగ్ చేయనున్నారు. వేలిముద్రలు సరిగా పడని పక్షంలో ఐరిస్ ద్వారా, ఓటీపీ ద్వారా ఆధార్ మ్యాపింగ్ చేస్తారు. సీసీఐ కొను గోళ్లలో దళారుల ప్రమేయం తగ్గించేందుకు పత్తి విక్రయానికి సంబంధించిన డబ్బులు నేరుగా ఆధార్‌కార్డు అనుసంధానం ఉన్న రైతు బ్యాంక్ ఖాతాలో పడనుంది. ఇందు కోసం రైతులు పట్టాదారు పాస్‌బుక్‌తో పాటు ఆధార్‌తో అనుసంధానం ఉన్న ఖాతా బుక్కు తీసుకురావాల్సి ఉంటుంది. ఓటీపీ ద్వారా డబ్బులు జమ చేయనున్నారు.

వైభవంగా చక్రతీర్థం


చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు

సిరిసిల్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సిరిసిల్ల మానేరు తీరంలోని బతుకమ్మ ఘాట్ వద్ద లక్ష్మీవేంకటేశ్వరస్వామికి చక్రతీర్థం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక అలంకరణలు చేశారు. మహిళలు మంగలహారతులతో పూజలు నిర్వహించారు.


కార్యక్రమానికి హాజరైన భక్తులు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ బాలబాలికల పోటీలు హోరాహోరీగా సాగాయి. శుక్రవారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా పరిధిలోని 13 మండలాల బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీలలో కబడ్డీ అండర్ - 14 బాలికల విభాగంలో ఎల్లారెడ్డిపేట విజయం సాధించింది. ఇల్లంతకుంట ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్ - 17 బాలికల విభాగంలో సిరిసిల్ల జట్టు విజయం సాధించగా ఇల్లంతకుంట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-14 బాలుర విభాగంలో గంభీరావుపేట జట్టు విజయం సాధించగా సిరిసిల్ల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-17 బాలుర విభాగంలో ముస్తాబాద్ విజయం సాధించగా వీర్నపల్లి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి బహుమతులను అందజేశారు.

పత్తిపాక మోహన్‌కు బాలసాహిత్యం పురస్కారం

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, బాలసాహితీవేత్త తెలుగునాట బాలసాహిత్య వికాసం కోసం కార్యశాలలు నిర్వహిస్తున్న డాక్టర్ పత్తిపాక మోహన్‌కు 2024 సంవత్సరానికి చందమామ కథరచయిత మాచిరాజు కామేశ్వర్‌రావు నెలకొల్పిన మాచిరాజు బాల సాహిత్య పురస్కారాన్ని ప్రకటించారు. 2023 నుంచి బాల సాహిత్యంలో విశేషకృషి చేసిన వారికి పురస్కారాన్ని అందిస్తున్నారు. గతంలో 1500 చందమామ కథలు రాసిన వసుంధర దంపతులకు అందజేశారు. మరో పురస్కారాన్ని సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణకు అందించారు. ఈ సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ పత్తిపాక మోహన్, చొక్కాపు వెంకటరమణకు ప్రకటించారు. నవంబరు 3న ఉదయం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా పత్తిపాక మోహన్‌కు మానేరు రచయితల సంఘం సభ్యులు టీవీ నారాయణ, ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్, జిందం అశోక్, బూర దేవానందం, కిరణ్‌కుమార్, అంకారపు రవి, గణేష్, వంశీ, శ్రీమతి, సౌమ్య, అనిత అభినందనలు తెలిపారు.

ప్రపంచ ఉపశమన సంరక్షణ చికిత్స వేడుకలు


వేములవాడ ఏరియా ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

వేములవాడ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ ఏరియా ఆసుపత్రిలోని పాలిటివ్ కేర్ సెంటర్‌లో ప్రపంచ ఉపశమన సంరక్షణ చికిత్స వేడుకలను శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ వసంతరావు, డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు శ్రీనివాస్, సత్యనారాయణ ఉన్నారు.

గ్రూప్స్ నిర్వహణకు సన్నద్ధం కావాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

సిరిసిల్ల, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో గ్రూప్స్ నిర్వహణకు సన్నద్ధం కావాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, రీజినల్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్ హాజరయ్యారు. నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3, డిసెంబరు 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను వివరించారు. జిల్లాలో పరీక్ష పత్రాలు, ఇతర ముఖ్య సామగ్రి భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూంలను గుర్తించాలన్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు వీలుగా జిల్లాలోని పరీక్ష కేంద్రాలకు రీజినల్ కో ఆర్డినేటర్‌లను నియమించాలన్నారు. జిల్లాలో గ్రూప్-3 పరీక్షకు 25 కేంద్రాలు, ఏర్పాటు చేశామని, 7320 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ వివరించారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం, వేణుగోపాలస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలను త్రిదండి రామానుజ దేవనాథ జీయర్‌స్వామితో కలిసి శుక్రవారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఆలయాలను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నిధులను సమకూర్చి పనులు చేపట్టనున్నామన్నారు. ఎల్లారెడ్డిపేటలోని ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.1.80 లక్షలు మంజూరై మళ్లీపోయాయని తన దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. అనంతరం త్రిదండి రామానుజ దేవనాథ జీయర్‌స్వామి మాట్లాడుతూ సమాజంలో ధర్మం, దైవం రెండు కళ్లలాంటివన్నారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు జితేందర్, ప్రభాకర్‌రెడ్డి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేశ్, రాంరెడ్డి, నర్సయ్య, రవీందర్, మల్లారెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాజేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన వారికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్యశ్రీ పరిధిని పెంచినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రానివాటికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి ఉండడంతోనే అర్హులకు పథకాలు అందుతున్నాయన్నారు. కొంతమంది నాయకులు రాజకీయ లబ్ధికోసం చేస్తున్న విమర్శలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నియంత్రించాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో మాదకద్రవ్యాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారు లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి నార్కో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలో సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న 525 ప్రభుత్వ పాఠశాలల్లో యాంటి డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. వాటిని యాక్టివ్‌గా ఉంచుతూ డ్రగ్స్‌తో కలిగే దుష్ప రిణామాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు డ్రగ్స్‌పై వ్యాస రచన పోటీలు నిర్వహించాలన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే తల్లి దండ్రుల సమావేశాల్లో ఉపాధ్యాయులు పై అంశాలను వివరించాలన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవస రమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో గంజాయి తోపాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు చేపట్టాల న్నారు. అటవీశాఖ అధికారులు వారి పరిధి లోని అటవీభూములు పరిశీలించాలని, గంజాయి సాగు కనిపిస్తూ వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ దుకాణాల్లో స్టాక్ వివరాలను ప్రతీ నెల తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ మాదకద్రవ్యాల నియంత్రణకు పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే కంట్రోల్ రూం నంబరు 8712656426కు ఫోన్ చేయాలన్నారు. సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డీఈవో రమేష్ కుమార్, ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి రామారావు, డీఐవో శ్రీనివాస్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ భవాని, ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో మెరుగైన వసతులు


కోనరావుపేటలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలను ప్రభుత్వ విప్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం సరైన సమయానికి బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని పాఠశాల, విద్యాలయం బాధ్యులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటూ బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. బాత్రూమ్‌లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మోడల్ స్కూల్ పరిసరాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, పిచ్చి మొక్కలను, కట్టెలను తొలగించాలని ఆదేశించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. పదవ తరగతి ఫలితాల్లో 10/10 సాధించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సన్మానం చేయిస్తానని తెలిపారు. అనంతరం కోనరావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయతీ సెక్రెటరీలు, స్పెషల్ ఆఫీసర్లతో, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే సూచనలను, సలహాలు పాటిస్తూ ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కేసు

- శునకం కళేబరానికి పోస్టుమార్టం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో తిరుగుతున్న ఒక కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, స్త్రీ యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్త తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో గురువారం ఒక కుక్కను అజీజ్ అనే వ్యక్తి ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. కుక్క కళేబరాన్ని అక్కడే ఉన్న డస్ట్‌బిన్‌లో పడేశాడు. ఈ ఘటనను స్థానికంగా ఉన్న ఒక జంతు సంరక్షణ కార్యకర్త తన ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం ఈ విషయాన్ని స్త్రీ యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్త ఎదులాపురం గౌతమ్‌కు తెలియజేశారు. వెంటనే ఆ కార్యకర్త సంఘటనాస్థలానికి చేరుకుని కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కరీంనగర్ ఒకటో ఠాణాలో ఫిర్యాదు చేశాడు. దీనిపై జంతు సంక్షేమ ఉద్యమ నాయకురాలు మేనకాగాంధీ పోలీసులకు ఫోన్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కరీంనగర్ వెటర్నరీ హాస్పిటల్‌లో కుక్క కళేబరానికి పోస్టుమార్టం కూడా నిర్వహించారు. ఈ కేసులో నిందితుడికి పోలీసులు నోటీసులు ఇచ్చి పంపించారు. ఆ కుక్క తనను కరవడంతోనే ఆగ్రహంగా అజీజ్ కొట్టిచంపాడని చెబుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


రమ్యకృష్ణ (ఫైల్)

పెగడపల్లి/రామడుగు, అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన అలువాల రమ్యకృష్ణ (30) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న రాత్రి రామడుగు మండలం గోపాల్‌రావుపేట నుంచి పెగడపల్లికి అలువాల విష్ణు, రమ్యకృష్ణలు ఇరువురు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మ్యాక వెంకయ్యపెల్లి గ్రామ శివారులో ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టగా కిందపడి గాయాలపాయ్యారు. రమ్య కృష్ణను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


లక్ష్మణ్‌గౌడ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన భాగన్నగారి లక్ష్మణ్ గౌడ్ (38) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గంభీరావుపేటకు చెందిన లక్ష్మణ్‌గౌడ్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ వైన్స్ దుకాణం అనుబంధమైన పర్మిట్ రూంలో కొంత కాలంగా వంట మనిషిగా పని చేస్తుండేవాడు. ఉదయం వచ్చి రాత్రి పూట వెళ్లేవాడు. గురువారం రాత్రి పర్మిట్ రూం మూసిన తర్వాత గంభీరావుపేటకు వెళ్లేందుకు స్థానిక కొత్త బస్టాండుకు చేరుకున్నాడు. ఓ టేలా వెనుక పడిపోయి కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. కొదురుపాక గ్రామానికి చెందిన దుగ్యాల జితేందర్‌రావు(22) అనే యువకుడు ఇటీవల ఖాళీగా తిరుగుతుండడంతో తల్లి ఏదైనా పని చేసుకోవాలని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన యువకుడు ఈనెల 15న ఊరు బయట పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, బంధువులు అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి కొన్నేళ్ల క్రితమే చనిపోగా, తల్లి లక్ష్మీకి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. పెద్ద కుమారుడు ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాడు. తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరుడి రథోత్సవం


లింగన్నపేటలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

గంభీరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : గంభీరావుపేట మండలం లింగన్నపేటలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. స్వామివారి బ్రహోత్సవాల్లో బాగంగా శుక్రవారం రథోత్సవం చేపట్టారు. గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీల ఆధ్వ ర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కేదెట్ల..?

- మెట్లదారిలో అడ్డంగా పడిన చెట్టు
- నడిచి వెళ్లే భక్తులకు ఇబ్బందులు


మెట్లదారిలో అడ్డంగా పడిన చెట్టు

మల్యాల, అక్టోబరు 18: కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి కొండపైకి నడిచి వెళ్లే మెట్లమార్గంలో చెట్టు అడ్డంగా పడిపోయింది. దీంతో ఈ మార్గంలో కొండ ఎక్కే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చెట్టు నెల రోజుల క్రితం పడిపోయినట్లు తెలుస్తుండగా దాన్ని తొలగించడం లేదు. దీనికి తోడు మెట్లమార్గానికి ఇరువైపుల పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి భక్తులు నడవడానికి అవరోధంగా మారింది. అయినా దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడం పట్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు


శిక్షణ పొందుతున్న యువకులతో పీడీ


యువకులకు శిక్షణ ఇస్తున్న గంగసాగర్

నిరుద్యోగ యువతకు అండగా

ఆదర్శం

- ఆర్మీలో చేరాలనుకునే వారికి ఉచిత శిక్షణ
- అభ్యర్థులను తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు
- ఇప్పటి వరకు 45 మందికి ఉద్యోగం

ఆర్మీ ఉద్యోగం సాధించాలనేది ఆయన కల. అందుకు తగ్గట్టుగానే కొన్నేళ్లు కష్టపడ్డాడు. ఎలాగైనా కొలువు సాధించాలని సాధన చేశాడు. కానీ ఆయన కల మాత్రం నెరవేరలేదు. చెవి దగ్గర ఉన్న చిన్న లోపంతో ఆయన ఆర్మీ ఉద్యోగానికి దూరం అయ్యాడు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. ఎంతో ఇష్టమైన ఆర్మీ ఉద్యోగం తనకు దక్కకున్నా ఆసక్తి ఉన్న వారు సాధించేలా సహాయ పడాలనుకున్నాడు. కానిస్టేబుల్, ఆర్మీ ఉద్యోగాలు అంటే ఇష్టమున్న యువతకు ఉచిత శిక్షణ ఇస్తూ వారు ఉద్యోగం సాధించేలా కృషి చేస్తున్నాడు.

మల్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన కల్వకోట గంగసాగర్ అనే యువకుడు ఆర్మీ ఉద్యోగం సాధించాలని అనుకున్నాడు. అనుకోని పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. అయితే ఆర్మీ ఉద్యోగం తనకు దక్కకపోయినా ఆ ఉద్యోగంలో యువతను చేర్పించాలనే ఆయన ఆశయంగా పెట్టుకున్నాడు. ఇందులో భాగంగా 2016 నుంచి నిరుద్యోగ యువతకు కానిస్టేబుల్, పారామిలటరీ బలగాలతోపాటు ఇటీవలి అగ్నివీర్‌కు ఉచిత శిక్షణ అందిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆయన శిక్షణ అందించిన వారిలో 35మంది కానిస్టేబుల్స్, 10 మంది ఆర్మీలో ఉద్యోగం సాధించారు. 2020లో వచ్చిన కానిస్టేబుల్ నోటిఫికేషన్ సందర్భంగా గంగసాగర్ 85 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చాడు. వారిలో 20 మంది ఉద్యోగం సాధించారు. 2018లో 55మంది శిక్షణ ఇస్తే అందులో 15మంది ఉద్యోగాలు పొందారు.

● ఉద్యోగం.. శిక్షణ

గంగసాగర్ వ్యాయామ ఉపాద్యాయుడుగా తన సొంతూరులోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉద్యోగం చేశాడు. అదే పాఠశాల మైదానంలో యువతకు శిక్షణ ప్రారంభించాడు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శారీరక శిక్షణ ఇస్తూ తరువాత పాఠశాలకు వెళ్లడం ఆయన దినచర్య. ప్రస్తుతం తాటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో



పీడీగా విధులు నిర్వహిస్తున్నాడు. గంగసాగర్ ఆసక్తి ఉన్న విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేలా నిత్యం శిక్షణ అందిస్తున్నాడు. గంగాసాగర్ వద్ద శిక్షణకు మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాల నుంచి యువకులు వస్తుంటారు. ప్రస్తుతం పారామిలటరీ, అగ్నివీర్‌కు 15మంది శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణతో పాటు కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాడు గంగసాగర్.

● మెడికల్ ఫెయిల్‌తో..

గంగసాగర్‌కు చిన్నప్పటి నుంచి ఆర్మీలో ఉద్యోగం సాధించి దేశసేవ సేవ చేయాలని కలలు కనేవాడు. అందులో భాగంగానే శిక్షణ పొందాడు. చెవి సంబంధిత చిన్న పాటి లోపంతో ఆర్మీ ఉద్యోగం సాధించలేక పోయాడు. దీంతో తాను సాధించకున్నా అదే ఉద్యోగం కొంత మంది యువతకైనా దక్కేలా చేయాలని అనుకున్నాడు. వెంటనే ఉచిత శిక్షణ ప్రారంభించాడు.

● ఉచితంగా శిక్షణ ఇస్తా..



ప్రజలకు సేవలందించే పోలీస్, ఆర్మీలో చేరాలనే యువతకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నా. ఆసక్తి ఉన్న యువకులు ఎవరైనా నన్ను సంప్రదించవచ్చు. శారీరక శిక్షణ ఇచ్చి, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తా. నేను ఆర్మీలో చేరాలని అనుకున్న.. సాధ్యం కాలేదు. నాలా ఆసక్తి ఉన్న కొంతమందైనా ఆర్మీలోకి వెళ్లాలనే ఆలోచనతో శిక్షణ ఇవ్వడం ప్రారంభించా.

- కల్వకోట గంగసాగర్

హుజూరాబాద్‌ఏరియా ఆస్పత్రి తనిఖీ

హుజూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చందు శుక్రవారం తనిఖీ చేశారు. గురువారం రాత్రి ఏరియా ఆస్పత్రిలోని బాత్రూంలో లభించిన నవజాత శిశువు మృతదేహంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుధాకర్‌రావు, విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, సెక్యూరిటీ, శానిటైజేషన్ సిబ్బందిని విచారించారు. ఆస్పత్రి సీసీ ఫుటేజీలను పోలీసులకు అందజేశారు. దర్యాప్తు చేసి దోషులను గుర్తించి చర్యలు తీసుకో వాలని ఫిర్యాదు చేశారు. అనంతరం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చందు మాట్లాడుతూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నా మన్నారు. ప్రజలను భయభ్రాంతులను చేయడానికే కొంత మంది ఇలాంటివి చేస్తున్నారని చెప్పారు. ఈ శిశువు మృతదేహం ఆస్పత్రి బయట నుంచి వచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందిని విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ చందు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట

పురుగుల మందు డబ్బాలతో ఆందోళన

- తన పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపణ
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమించిన రైతు


గొల్లపల్లి, అక్టోబరు 18: తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ ఏర్పాటు యత్నాలను నిరసిస్తూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు తన కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాలతో శుక్రవారం ఆందోళన చేపట్టాడు. బాధితుడు మండలంలోని బీబీరాజ్ పల్లె గ్రామానికి చెందిన రైతు నరేష్ మాట్లాడుతూ తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ తీయడానికి గ్రామానికి చెందిన కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించాడు. కాలువ పరిసరాల్లో చాలా మంది రైతుల పట్టా భూములు ఉన్నాయని, వారెవ్వరి భూములను సర్వే చేయకుండా తనవే సర్వే చేయడంతో గతంలో పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా మళ్లీ సర్వే చేసేందుకు వచ్చారని పేర్కొన్నాడు.

దీంతో మనస్తాపం చెంది ఆందోళనకు దిగినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరందన్ బాధిత రైతు వద్దకు వచ్చి మాట్లాడారు. పట్టా భూమిలో నుంచి ఎలాంటి తోవ ఏర్పాటు చేయడం లేదని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొనడంతో బాధితులు ఆందోళనను విరమించారు. ల్యాండ్ అక్విజేషన్‌లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేశామని, అంతే తప్ప పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేసే అధికారం తనకు లేదని పేర్కొన్నారు. తాను మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టానని, దీని పై పూర్తి స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


రవీందర్ సాగుచేస్తున్న బంతితోట


పట్టుకుచ్చు తోట


మునగ తోటలో అంతర్ పంటగా బంతి తోట


పూత దశలో ఉన్న బంతి తోట

సీజనల్ తోటలు

- పూలు, కూరగాయల సాగుతో లాభాలు
- పండగల సమయంలో పూలకు గిరాకీ

సైదాపూర్, అక్టోబరు 18: సీజన్‌ను బట్టి పూలు, కూరగాయల తోటల సాగు చేస్తూ కొందరు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రతీసారీ వరి, పత్తి, మొక్క జొన్న పంటలు పండిస్తుండడంతో భూములలో భూసారం తగ్గి పంట దిగుబడి రాకపోవడం, చీడ పీడలు ఆశించడంతో చాలా మంది రైతులు నష్ట పోతున్నారు. దీంతో కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారిస్తు న్నారు. సైదాపూర్ మండలం రాంచంద్రా పూర్ గ్రామానికి చెందిన రైతు ఎనుగుల రవీందర్ బంతిపూలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. రవీందర్ తన కున్న నాలుగు ఎకరాల భూమితో పాటు ఇంకో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. సీజన్లను బట్టి కూరగాయలు, పూలతోటల పెంపకానికి మొగ్గు చూపాడు. ఎనిమిది ఎక రాల్లో పూలు, కూరగాయలు సాగు చేస్తు న్నాడు. ఎకరానికి రెండు లక్షల వరకు ఆదా యం వస్తుందని రవీందర్ అంటున్నాడు. వ్యవసాయంతోపాటు రవీందర్ పాడి ఆవులు పోషిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నాడు.

● మునగ తోటలో అంతర పంటలుగా..

ఎనిమిది ఎకరాల్లో మునగ తోట సాగు చేస్తున్నాడు. చెట్ల మధ్యలో ఖాళీగా ఉన్న భూమిలో అంతర పంటగా బంతి, పట్టు కుచ్చు పూల తోటలు సాగు చేశాడు. బతుకమ్మ పండగ మొదలు కొని ఉగాది వరకు పూలకు మంచి గిరాకీ ఉంటుంది. దసరా నుంచి ఉగాది వరకు మంచి రోజులు ఉండడంతో శుభకార్యాలు జరుగుతుంటాయి. ఈ సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది.

● గిరాకీకి అనుగుణంగా కూరగాయల సాగు

ఏ కూరగాయలకు ఏ సీజన్‌లో గిరాకి ఉంటుందోనని గుర్తించి, ఆ సీజన్లో ఆ కూరగాయలు సాగు చేస్తుంటాడు. పండిన కూరగాయలు, పూలను హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, కరీంనగర్, సిద్దిపేట మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. తోట వద్దకు వచ్చిన వారికి తాజ పూలు, కురగాయలు కోసి అమ్ముతారు..

● మంచి లాభాలు వస్తున్నాయి

నేను ఎనిమిది సంవత్సరాలుగా కాలానికనుగునంగా సీజన్ బట్టి పూలు, కూరగాయల తోటలు సాగు చేస్తున్నాను.ఎకరాకు పెట్టుబడి పోను 1.5 లక్షల రూపాయల వరకు ఆదా యం వస్తుంది. కష్టపడి పని చేస్తే వాణిజ్య పంటలతో లాభాలు పొందవచ్చు.

- ఎనుగుల రవీందర్, రైతు, రాంచంద్రాపూర్


బంతి తోటలో ఎనుగుల రవీందర్

వేర్వేరు చోట్ల చోరీ

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల చోరీలు జరిగాయి. ధర్మారం మండల కేంద్రానికి చెందిన చింతల రాజు అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు చింతల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి తన కుటుంబ సభ్యులతో కేశపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో తన బంధువుల ఇంటిలో నిర్వహించిన శుభాకార్యానికి వెళ్లిన సమయంలో ధర్మారం మండల కేంద్రంలోని తాళం వేసిన తన ఇంటిలో తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉదయం తన డ్రైవర్ రాజు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయని తెలుపగా కుటుంబ సభ్యులతో సహా ధర్మారం వచ్చి చూసేసరికి తలుపులు పగులగొట్టి, బీరువా తెరిచి ఉందని అందులో 38 గ్రాముల బంగారం, 30 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో నారాయణరావు అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఇంటి తాళాలు పగుల గొట్టి తులంన్నర బంగారు చైను. అర తులం చొప్పున ఉన్న రెండు బంగారు ఉంగరాలు, రూ.8 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇంటి ముందు పెట్టిన కారును తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వీలుగాక కారును ధ్వంసం చేశారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల పలుచోట్ల దొంగతనాలు జరిగాయి. దొంగతనాలకు సంబంధించి పోలీస్‌లు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యక్తిపై కత్తితో దాడి

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన నూనే రవి అనే వ్యక్తిని అదే కాలనీకి చెందిన విబూది కిష్టయ్య కత్తితో దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నూనే రవి ఇంటి సమీపంలోని కిష్టయ్య వద్ద కొన్ని రోజుల క్రితం మధ్యవర్తిగా ఉండి మరో వ్యక్తికి డబ్బులను ఇప్పించాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న రవిని డబ్బులు చెల్లించాలని కిష్టయ్య అడిగాడ . దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కిష్టయ్య ఇంట్లోకి వెళ్లి కత్తి తెచ్చి రవిపై దాడికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వారించడంతో కిష్టయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించి రవిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు మద్యం మత్తులో ఘర్షణకు దిగినట్లు స్థానికులు తెలిపారు. రవి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాప్ వేలంపై కేసు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటలో బెల్ట్‌షాప్ వేలం వేసిన మాజీ సర్పంచ్ బాలసాని పర్శరాం, బొద్దుల పర్శరాం, గౌర అంజయ్య, సోమ మల్లయ్యపై శుక్రవారం కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయానికి అమ్మ డానికి పెద్దమనుషులు వేలం నిర్వహించగా జి.శ్రీకాంత్ అనే వ్యక్తిని షాప్ నడిపేందుకు రూ.66,500 డిమాండ్ చేశారని, రూ.33 వేలు తీసుకొని మిగతావి ఇవ్వాలని బెదిరించారని డీఎస్పీ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆవిష్కరణలపై ఎస్సారార్‌లో వర్క్‌షాప్

గణేశ్‌నగర్,అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో శుక్రవారం సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీం, పాలసీస్, ఐక్యూఏసీ సంయుక్త నిర్వహణలో కళాశాల అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో ఇనిస్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ నిరంతరం మదింపు చేసుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్‌షాప్ కొరకు ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలను ఎంచుకున్నందుకు కళాశాల విద్యా కమిషనర్ శ్రీ దేవసేనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్రిస్ప్ కోఆర్డినేటర్ సురభి కాక్ నిర్వహించారు. ఇనిస్టూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ సస్టైనబుల్ గోల్స్ విశ్లేషణ, విజన్ మిషన్, లక్ష్యాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముందుగా ఫ్లగ్ పోస్ట్ టెరిటరీ అనే కార్యాచరణను ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ హరజోత్ కౌర్ మాట్లాడుతూ ఐక్యూఏసి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ పి నితిన్, టి రాజయ్య, సీఓఈ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూఏసి సభ్యులు డాక్టర్ టి కరుణాకర్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సోమనరసయ్య, డాక్టర్ రాజశ్రీ, ప్రేమ్చందర్, అన్ని విభాగాల హెచ్‌ఓడిలు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కాటన్ వస్త్ర పరిశ్రమకు చేయూతనివ్వాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కాటన్ వస్త్ర పరిశ్రమతోపాటు వాటిపై ఆధారపడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వొల్లాల కిషోర్, ఎలిగేటి రాము డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళి శాఖ కార్యాలయానికి కరీంనగర్ జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ సిరిసిల్ల శాఖ ఆధ్వర్యంలో కాటన్ కార్మికులు తరలివచ్చి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ రెండో భీవండిగా పేరుగాంచిందన్నారు. గతంలో సిరిసిల్లలో వేలాది మర మగ్గాలు ఉండేవని, వాటికి అనుబంధంగా 30 సైజింగ్ పరిశ్రమలతోపాటు క్లాత్ డైయింగ్, పెట్టి కోట్స్, హమాలీ, ట్రాన్స్ పోర్ట్‌ల ద్వారా వేలాది మంది జీవనోపాధి పొందారని అన్నారు. గత ప్రభుత్వం కాటన్ వస్త్ర పరిశ్రమలకు మొండి చేయి చూపిందని, పాలి స్టర్ బతుకమ్మ చీరల ను తయారు చేయించడంతో కాటన్ వస్త్ర పరిశ్రమ కుంటు పడిపోయిందని అన్నారు. కార్మికులకు జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన చీరలను కాటన్‌తో తయారు చేయించాలని కోరారు.



కరీంనగర్ జిల్లా జైలు

బతుకుపై భరోసానిస్తూ..

ఒకప్పుడు జైళ్లు అంటే కఠిన శిక్షలకు మారు పేరు.. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. ప్రభుత్వాలు పలు సంస్కరణలను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా శిక్షను అనుభవిస్తున్న ఖైదీలకు వివిధ పనుల్లో శిక్షణను అందిస్తున్నారు. కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తున్నారు. ఇందులో శిక్షను అనుభవిస్తున్న వారితోపాటు విడుదలైన వారూ పని చేస్తున్నారు. జైలులో పలువురు ఫర్నీచర్, ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు. దీని ద్వారా ఖైదీలు ఉపాధి పొంది కొంత మొత్తాన్ని ఇంటికి పంపించుకుంటున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తాము నేర్చుకున్న పనులు చేసుకుంటూ సమాజంలో గౌరవంగా బతుకుతున్నారు.

- సంస్కరణలకు కేంద్రంగా కరీంనగర్ జిల్లా జైలు
- ఖైదీలకు వివిధ అంశాల్లో శిక్షణ
- పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుతో ఉపాధి
- జైలు నుంచి విడుదలైన తర్వాత గౌరవంగా బతికేలా చర్యలు



బంకులో పని చేస్తున్న ఖైదీలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నేర సంఘటనల్లో జైలుకు వెళ్లిన ఖైదీలపై సమాజంలో కొంత చెడు అభిప్రాయం ఉండడం సహజం. శిక్షణ అనుభవించి బయటకు వచ్చిన తర్వాత తమ పద్ధతి, వ్యవహారశైలిని మార్చుకుని మంచి వ్యక్తులుగా జీవించాలని భావించినా సమాజంలో వారిని నేరస్థులుగానే పరిగణిస్తున్నారు. దీంతో వారికి ఎక్కడా సరైన ఉపాధి లభించడం లేదు. ఇటువంటి పరివర్తన చెందిన ఖైదీల కోసం జైళ్లశాఖ ఉపాధి కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణనిస్తోంది. శిక్ష కాలంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ జైలు నుంచి విడుదల అయిన తరువాత వారు మళ్లీ నేరాలకు పాల్పడకుండా జీవనోపాధి మార్గాలను చూపుతున్నది. ఖైదీల నడవడికలో మార్పును తీసుకువచ్చి సమాజంలో పౌరులుగా గౌరవంగా బతికేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ ముందుకు సాగుతున్నది.

● వివిధ పనుల్లో శిక్షణ

కరీంనగర్ జిల్లా జైలులో పలు సంస్కరణలు తీసుకువచ్చారు. మొదట ఖైదీలకు వరంగల్ సెంట్రల్ జైలు, కరీంనగర్ జైలులో వివిధ పనుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆ తరువాత శిక్షణ పొందిన ఖైదీలతో ఫర్నిచర్, ఫినాయిల్ తయారీని చేపట్టారు. జైలు ఆవరణలో ఐఓసీఎల్ సంస్థ సహకారంతో మై నేషన్ పేరుతో పెట్రోల్‌బంక్‌ను నెలకొల్పారు. ఈ పెట్రోల్‌బంక్‌లో ప్రస్తుతం ఐదుగురు రిమాండ్ ఖైదీలతోపాటు జైలు నుంచి విడుదలైన మరో 20 మందికి ఉపాధిని కల్పిస్తున్నారు. వీరిలో రిమాండ్ ఖైదీలకు రోజుకు 225, శిక్ష అనుభవించి విడుదలైన వారికి రోజుకు 550 రూపాయల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు.

● పెట్రోల్ బంక్ విస్తరణ

కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో 2017 జూన్ 17న ఐఓసిఎల్ పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) సంస్థ మొదట మూడు యంత్రాలతో 12 నాజిల్స్ ఏర్పాటు చేసింది. గిరాకీ పెరగడంతో ఆరు యంత్రాలు, 24 నాజిల్స్‌కు విస్తరించింది. జైలుకు చెందిన 1,200 చదరపు గజాల విస్తీర్ణంలో బంక్ నిర్మాణానికి ఒప్పందం చేసుకుని ఈ స్థలాన్ని 20 ఏళ్లపాటు ఐఓసీఎల్ సంస్థ లీజుకు తీసుకున్నది. ఈ పెట్రోల్‌బంక్‌లో రోజుకు 18 లక్షల నుంచి 20 లక్షల వ్యాపారం జరుగుతున్నది. రోజుకు ఎనిమిది వేల నుంచి 10 వేల లీటర్ల పెట్రోల్, ఆరు వేల నుంచి 8 వేల లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయి. పెట్రోల్ అమ్మకాలపై లీటరుకు రెండు రూపాయలు కమిషన్‌గా ఆదాయం సమకూరుతున్నది. జిల్లా జైలు రెండున్నర ఎకరాల స్థలంలో ఉంది. ఇందులో జైలు బ్యారక్, ఇతర కార్యాలయాలు, జైలు అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ ఉన్నాయి. జైలు ఆవరణలోని పెట్రోల్‌బంక్ లాభసాటిగా నడుస్తుండడంతో కరీంనగర్ శివారులో మరో పెట్రోల్ బంక్‌ను జైళ్లశాఖ లీజ్‌కు తీసుకుని నడిపిస్తున్నది. ఈ పెట్రోల్‌బంక్‌లో రోజుకు నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వ్యాపారం సాగుతున్నది. ఇక్కడ ఎనిమిది మంది ఖైదీలు పనిచేస్తున్నారు. జైలు లోపల ఏర్పాటు చేసిన ఫర్నిచర్ తయారీ కేంద్రంలో మరో 30 మంది వరకు ఉపాధిని కల్పిస్తున్నారు.

● జైళ్ల శాఖ అవుట్‌లెట్...

కరీంనగర్ జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఒక అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి ఇందులో కరీంనగర్, వరంగల్ సెంట్రల్ జైలు ఖైదీలు తయారు చేసిన వస్తువులను విక్రయిస్తున్నారు. వీటికి మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ స్టాల్‌లో కూడా ఖైదీ ఉపాధి పొందుతున్నాడు. జైలు ఆవరణలో నర్సరీలో పెంచిన మొక్కలను, ఫినాయిల్‌ను కూడా ప్రత్యేకస్టాల్ ఏర్పాటుచేసి విక్రయిస్తున్నారు. జైల్ ఇండస్ట్రీలో తయారైన కుర్చీలు, టేబుళ్ళు ఇతర ఫర్నిచర్‌ను పాఠశాలలకు విక్రయిస్తున్నారు.

ఆరేళ్లుగా పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాను : ఇర్ఫాన్, ఓపెన్‌జైలు ఖైదీ

నేను జైలులోనే ఉంటూ ఇక్కడి పెట్రోల్‌బంక్‌లో ఆరేళ్లుగా పని చేస్తున్నాను. సంపాదించిన డబ్బుల్లో కొంత ఇంటికి పంపిస్తున్నాను. ఓపెన్ జైలులో భాగంగా పెట్రోల్‌బంక్‌లో పనిచేయడం వల్ల నిత్యం ప్రజల్లో ఉండడంతో ప్రశాంతంగా ఉంది. సత్ప్రవర్తనతో ఉండడంతో ఆరు నెలలకు ఒకసారి నెల రోజులు పెరోల్‌పై ఇంటికి వెళి కుటుంబసభ్యులతో గడుపుతున్నాను.

ఉపాధి చూపించారు.. : రాజు

2015 నుంచి జైలు పెట్రోల్‌బంక్‌లో పని చేస్తున్నాను. ఏడు సంవత్సరాల క్రితం జైలు నుంచి విడుదల అయినప్పటి నుంచి పెట్రోల్‌బంక్‌లో పార్ట్ టైంగా పనిచేస్తూ మిగతా సమయంలో ఇంటి వద్ద వ్యవసాయం, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నెలకు 16 వేల రూపాయలు సంపాదిస్తున్నాను. నాకు ఉపాధిని కల్పించిన జైలు అధికారులకు కృతజ్ఞతలు.

● ఖైదీల్లో పరివర్తనపై దృష్టి సారించాం..



క్షణికావేశంలో చేసిన తప్పుకు జైలుకు వచ్చిన ఖైదీల్లో పరివర్తతీసుకువచ్చి, సత్ప్రవర్తన కలిగిన వ్యక్తిగా జైలు నుంచి బయటకు వెళ్ళి సామాన్యజీవిత గడిపేలా చేయడమే ధ్యేయంగా జైలు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నాం. నేరస్థుడిలో మార్పు తీసుకువచ్చి సమాజంలో గౌరవంగా బతికేలా అతనికి ఉపాధి కల్పించటానికి ప్రయత్నిస్తున్నాం. ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణను అందిస్తూ సొంతకాళ్లపై నిలబడేలా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛతకు మారుపేరుగా మైనేషన్ బ్రాండ్‌తో పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్నాం. 24 గంటలపాటు సీసీ కెమెరాల నిఘాలో ఈ పెట్రోల్ బంక్ నడుస్తుంది.

- కె శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్

పత్తి నాణ్యత బేష్

● సీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌దావే


జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న అర్జున్‌దావే

జమ్మికుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో పత్తి నాణ్యత బాగుందని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డా వే అన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో నోటిఫై చేసిన ఏడు జిన్నింగ్ మిల్లులను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. మిల్లుల్లోని యంత్రాలు, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిన్నింగ్ చేసేందుకు యంత్రాలు సిద్ధంగా ఉన్నాయో, లేదో పరిశీలించారు. పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. బహిరంగ వేలం పాట ద్వారా ట్రేడర్స్ ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారో పర్యవేక్షించారు. రైతులు తీసుకువచ్చిన పత్తి నాణ్యతను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆర్ మల్లేశం, ఇతర అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో కలిసి సమావేశం అయ్యారు. జిన్నింగ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీసీఐ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ జమ్మికుంటలో పత్తి నాణ్యత చాల బాగుందన్నారు. కాని తేమశాతం 30పైకి పైగా వస్తుందన్నారు. రైతులు ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టి తీసుకు వస్తే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. నోటిఫై చేసిన మిల్లులన్ని తనిఖీలు చేశామని, జిన్నింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తేమశాతం 12లోపు వస్తే కొనుగోళ్లు చేపట్టేందుకు ఇప్పుడు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ మద్దతు ధర 7,521 రూపాయలు దాటి ప్రైవేట్ ట్రేడర్స్ కొనుగోళ్లు చేపడితే కమర్షియల్ పర్చస్ సైతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వరంగల్ సీసీఐ పరిధిలోని కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కాగా పట్టణంలోని సరిత కాటన్ జిన్నింగ్ మిల్లుకు ఓ రైతు తమ పత్తిని విక్రయానికి తెచ్చాడు. పత్తిని పరిశీలించే ముందు సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డావే తమ కాళ్లకు ఉన్న షూస్‌ను తొలగించి పత్తిని ముట్టుకున్నారు. రైతు పండించిన పత్తిని సీసీఐ అధికారి అంత పవిత్రంగా బావించడంపై అక్కడున్న వారు అభినందిస్తూ చర్చించుకున్నారు.

'శాతవాహన' వీసీగా ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్


ఉమేశ్‌కుమార్

కరీంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి (వీసీ)గా ప్రొఫెసర్ డాక్టర్ యు. ఉమేశ్‌కుమార్ నియమితులయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటకు చెందిన ఉమేశ్‌కుమార్ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా, రిజిస్ట్రార్‌గా, శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. యుఎస్‌ఏలోని యూనివర్సిటీ ఆఫ్ వెర్మోంట్‌లో బయోకెమిస్ట్రీ విభాగంలో పోస్ట్ డాక్టోరల్ అసోసియేట్‌గా సేవలందించారు. 28 సంవత్సరాల బోధన, 20 సంవత్సరాల పరిశోధన అనుభవాన్ని కలిగిన ఉమేశ్ కుమార్ వివిధ జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో 36 కథనాలను ప్రచురించారు. అతడు యూజీసీలో సైతం రెండు చిన్న పరిశోధన ప్రాజెక్టులను చేపట్టారు. ఆయన మార్గదర్శకత్వంలో తొమ్మిది మంది పరిశోధకులకు పీహెచ్‌డీ పొందగా, ఒకరు పీహెచ్‌డీ కోసం పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ ఈసీగా, హర్యానాలోని బివానీ చౌదరి బన్సీలాల్ విశ్వవిద్యాలయానికి గవర్నర్ నామినీగా నియమితులయ్యారు. పాలమూరు యూనివర్సిటీలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా ఉమేశ్‌కుమార్ పనిచేశారు. అత్యుత్తమ విద్యా సహకారాలకు వివిధ విద్యావేత్తల నుంచి అవార్డులను అందుకున్నారు. అతను ఎంచుకున్న రంగంలో అకడమిక్ ఎక్సలెన్స్‌గా గుర్తింపుతో అవార్డులను స్వీకరించారు. సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, ఐఎస్‌బిఆర్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో వివిధ అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ పదవులను నిర్వహించారు. నవంబర్ 19, 2015న భారత రాష్ట్రపతి నుంచి ప్రతిష్టాత్మక ఇందిరాగాంధీ జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ ట్రోఫీని కూడా అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట అనుభవం కలిగిన ప్రొఫెసర్ యు.ఉమేశ్‌కుమార్‌ను శాతవాహన వీసీగా నియమించడం పట్ల పలువురు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆయన శనివారం వీసీగా బాధ్యతలు స్వీకరిస్తారని తెలిసింది.

గ్రానైట్ లారీని ఢీకొన్న మినీ వ్యాన్

● ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన మినీ వ్యాన్

తిమ్మాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న గ్రానైట్ లారీని మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రానైట్ లారీ మండలంలోని ఎల్ఎండీ కాలనీ మహిళా శిశు కేంద్రం సమీపంలో రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి నిలిచిపోయింది. వరంగల్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళుతున్న మినీ వ్యాన్ ఆగివున్న గ్రానైట్ లారీను అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్‌లో ఉన్న సిద్దిపేట జిల్లా గౌరెల్లి మండల్ కొండాపూర్ గ్రామానికి చెందిన భాక్యరాజు, సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కొతిగల్ గ్రామానికి చెందిన ఎల్ వాగ్య వాహనంలోనే ఇరుక్కుపోయారు. అటుగా వెళుతున్న వాహనదారులు ఆగి వాహనం లో ఇరుక్కుపోయిన ఇద్దరినీ బయటకు తీసి అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన స్థలానికి ఎల్ఎండీ బ్లూ కోల్ట్స్ పోలీసులు సురేష్, మల్లికార్జున్ చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సీఎం గ్రీన్ సిగ్నల్

కోల్‌సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సంబంధించి లాంఛన ప్రక్రియను పూర్తి చేసింది. ఇప్పటికే కలెక్టర్ నుంచి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల పరిధిలోని పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలు, రామగిరి, కమాన్‌పూర్, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోకి వస్తున్నాయి. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారాన్ని కూడా దీని పరిధిలోకి చేర్చారు. వెల్గటూరు మండల పరిధిలోని కొన్ని గ్రామాలు విలీనం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రామగుండంతో పాటు మరో రెండు మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సైతం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. రామగుండం శాసన సభ్యుడు రాజ్‌ఠాకూర్ రుడా ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వద్ద ప్రతిపాదన పెట్టడమే కాకుండా పట్టుబడుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు దీనికి సంబంధించి ప్రక్రియ ముందుకు సాగడంలో చొరవ చూపుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 7,59,332 జనాభా ఉంది. 2024లో ఈ జనాభా 15లక్షలు దాటుతుందని అంచనా వేస్తున్నారు. 7లక్షల జనాభాతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు తెలుస్తుంది. ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో దీనికి సంబంధించి ఎజెండా పెట్టనున్నారు.

● నామకరణమే తరువాయి..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు ఖాయమైపోయింది. ఇక నామకరణమే మిగిలింది. సుదీర్ఘ కాలంగా రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటు చేయాలని జిల్లాలో డిమాండ్ ఉంది. రామగుండానికి చారిత్రక, పురాణాల నేపథ్యం ఉంది. రామయణ కాలంలో రాముడు ఇక్కడ నివసించాడనే నానుడింది. ఆ పేరునే రామునిగుండాలు ఉన్నాయి. ఈ గుండాల పేరు మీదునే ఈ నగరానికి రామగుండంగా పేరు వచ్చింది. జనగామలో పురాతన త్రిలింగ రాజరాజేశ్వరస్వామి దేవాలయం కూడా ఉంది. దేశంలోనే ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి పరిశ్రమలున్నాయి. ఈ నేపథ్యంలో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీనే సముచితంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. కాగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ విస్తరిస్తుండడంతో మరేదైనా పేరును ఖరారు చేస్తారా అనే చర్చ కూడా సాగుతోంది. కరీంనగర్‌లో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, వరంగల్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వంటివి ఏర్పాటు చేశారు. ఇక జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు, యంత్రాంగం సూచించే పేరునే ఖరారు చేసే అవకాశం ఉంది.

23 నుంచి వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలి

తిమ్మాపూర్, అక్టోబరు18 (ఆంధ్ర జ్యోతి): డిప్లొమా ఇన్ ఎలమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(డీఈ ఈసెట్)-2024 ఉత్తీర్ణులై సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు 23వ తేదీ నుంచి డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరిఫికెట్ల పరిశీలనకు హాజరు కాని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈ నెల 21న కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


అంబేద్కర్ విగ్రహానికు వినతిపత్రం సమర్పిస్తున్న సర్పంచులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను విడుదల చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శిబిరంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం అనుమతులతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను విడదల చేయకుండా గత ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు విడదల చేయడంలో చిన్నచూపు చూడడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిల్లులు విడుదల చేసే వరకు జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామన్నారు. తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శి కోల నర్సయ్య, ఏనుగుల కేశవరావు, నాయకులు గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం, వెంకటనర్సింహారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాలపై ఎన్టీపీసీ నిర్లక్ష్యం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గుంతలు పడిన రోడ్డు

అంతర్గాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని నిర్వాసిత గ్రామం కుందనపల్లిపై ఎన్‌టీపీసీ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యం వహిస్తోంది. ఎన్‌టీపీసీ సంస్థ నిర్మాణ సమయంలో కుందనపల్లికి చెందిన రైతుల నుంచి వందలాది ఎకరాల భూములు సేకరించి యాష్‌పాండ్‌లు నిర్మించింది. దీంతో బూడిద కారణంగా కుందనపల్లి అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నది. యాష్‌పాండ్‌ల కారణంగా గ్రామంలోని బావులోని నీరు కలుషితం కావడంతో పాటు వీచే గాలులతో బూడిద మొత్తం పైకి లేచి గ్రామాన్ని కమ్మేస్తోంది. బూడిద చెరువుల కారణంగా గ్రామస్థులు నిత్యం కాలుష్యం కోరల మధ్య జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్‌టీపీసీ నిర్మాణ సమయంలో గ్రామస్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ విస్మరించి ఎన్‌టీపీసీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడి బూడిద నివారణ చర్యలు చేపట్టి మౌలిక సదుపాయాల కల్పనలో కృషి చేయాలని కోరుతున్నారు.

● పూర్తిగా చెడిపోయిన రహదారులు..

ఎన్‌టీపీసీ నిర్వాసిత గ్రామం కుందనపల్లి పంచాయతీ పరిధిలోని మొగల్ పహాడ్, అక్బర్‌నగర్, బద్రిపల్లి గ్రామాల్లో గత కొన్ని సంవత్సరాలుగా రహదారులు నిర్మించకపోవడంతో ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని రహదారులు పూర్తిగా చెడిపోయి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి గ్రామాల్లో రహదారుల నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● సాగుకు నోచుకోని పంట పొలాలు..

మండల పరిధిలోని ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామం కుందనపల్లిలో పంట పొలాలు గత కొన్ని సంవత్సరాలుగా సాగుకు నోచుకోవడం లేదు. ఎన్‌టీపీసీ యాష్ పాండ్ బూడిద కారణంగా పంట పొలాల్లో తుంగ మొలిచి భూములు ప్రస్తుతం సాగుకు పనికి రాకుండా పోయాయి. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి పొలాల్లో మొలిచిన తుంగను తొలగించి పంట పొలాలు సాగుకు అనువైన పరిస్థితులని నెలకొల్పాలని కుందనపల్లి రైతులు కోరుతున్నారు.


పొలాల్లో మొలిచిన తుంగ

● మరమ్మతులకు నోచుకోని నీటి శుద్ధి కేంద్రం..

కుందనపల్లి పరిధిలో గల మొగల్‌పహాడ్ గ్రామంలోని మంచి నీటి శుద్ధి కేంద్రం గత సంవత్సరకాలంగా పనిచేయకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌టీపీసీ సంస్థ సీఎస్ఆర్-సీడీలో భాగంగా నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ గత సంవత్సర కాలంగా నీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి మంచి నీటి శుద్ధి కేంద్రం మరమ్మతులు చేపట్టి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



భూములు సాగుకు నోచుకోవడం లేదు..

ఎన్‌టీపీసీ నిర్మాణ సమయంలో సేకరించిన భూములు పోను మిగి లిన కొద్దిపాటి భూముల్లో తుంగ మొలిచి సాగుకు నోచుకోవడం లేదు. ఎన్‌టీపీసీ యాజమాన్యం భూములు సాగుకు ఉపయోగ పడేలా చర్యలు చేపట్టాలి.

- మేకల బాపు, రైతు, కుందనపల్లి

న్యూస్ బాక్స్

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వండి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను మున్సిపల్ అధికారులు డ్రా పద్ధతిన ఎంపిక చేశారని, ఇప్పుడు ఇవ్వ డం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్ ఏవో రామిరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రేణుక, కవిత, స్వప్న, రూప, మమత, పద్మ, బుచ్చవ్వ, ఇందుకుమారి, అక్షయ, శారద, స్వప్న, అర్చన, సువర్ణ, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలను చిత్తు చేసుకోవద్దు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుతో తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దని తెలంగాణ సాంస్కృతిక జిల్లా సారధి టీం ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో మత్తు పదార్థాల నిషేదంపై శుక్రవారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు రామచంద్రం, శ్రీనివాస్, పర్శరాములు, గణేశ్ పాల్గొన్నారు.

కోనరావుపేట: మత్తు పదార్థాల నివారణపై కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో శుక్రవారంసాంస్కృతిక సారథి పొత్తూరు రాజు కళాబృందం ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి వేములవాడ టీం లీడర్ పొత్తూరి రాజు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

వేములవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని విచక్షణారహితంగా కొట్టి కర్ణభేరి దెబ్బ తినడానికి కారణమైన వేములవాడ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ విభాగం కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణంలోని శ్రీచైతన్య ప్రైవేటు పాఠశాలలో విద్యార్థిని ఉపాధ్యాయుడు చెవిపై కొట్టడంతో విద్యార్థి కర్ణభేరి రంధ్రం పడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడన్నారు. పాఠశాల భవనంలో సేఫ్టీ రూల్స్ పాటించడం లేదని, సెల్లార్‌లోనూ పాఠశాల నడిపిస్తున్నారని ఆరోపించారు. లాభాపేక్ష మాత్రమే లక్ష్యంగా అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను వేధిస్తున్నారని, తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోప్పెల్లి రాజు, సావనపల్లి ప్రశాంత్, ఎల్లగందుల శ్రీనివాస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

టవర్ తొలగించాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం సంజీవయ్యనగర్ కొత్త చెరువు కట్టను ఆనుకొని నిర్మించిన సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ సంజీవయ్యనగర్‌కు చెందిన బాధితులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంజీవయ్యనగర్ కొత్త చెరువు కట్ట కింద 1478 సర్వే నెంబరులో సుమ్మిట్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వారు సెల్ టవర్ ఏర్పాటు చేశారన్నారు. సెల్ టవర్‌తో తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ ఏర్పాటు చేశారని మున్సిపల్ కమీషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు చచెప్పారు. 15 రోజుల లోపు సెల్ టవర్‌ను తొల గించాలని మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారని, గడువు ముగిసినా సెల్ టవర్‌ను తొలగించలేదని అధికారులు చర్యలు తీసుకో వడం లేదని ఆరోపించారు. మున్సిపల్ అధికా రుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు సిరిగిరి నవీన్, రాగుల వీణ, పి.సుప్రియ, పి.వనజ, పీ రమేష్, అంజనేయులు తదిత రులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ఇల్లంతకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు, ధాన్యం తీసుకవచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా సూచించారు. మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు రైతులు పండించిన ధాన్యాన్నంత కొనుగోలు చేయాలని అన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని తీసుకరావాలని సూచించారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని సేకరించాలని, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. నిర్వాహకులకు ఏమైన ఇబ్బందులు ఎదురైతే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం సన్నపు వడ్లకు బోనస్ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎమ్‌సీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, ప్యాక్స్‌వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఏఎమ్‌సీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మీడియాసెల్ ఇంచార్జ్ శ్రీనివాస్‌లతో పాటు సహకార సంఘ, ఏఎమ్‌సీ డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మండలంలోని నామాపూర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే తరలించాలని కోరారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, పీడీ డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ సురేశ్, సహకార సంఘం చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సయ్య, వైస్ చైర్మన్‌లు నిమ్మ రవి, రాంరెడ్డి, డైరెక్టర్‌లు కరెడ్ల కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం లాల్ సింగ్ తండా, వన్ పల్లి, అడవిపదిర, సీతారాంనాయక్ తండా గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, లోడింగ్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. టోకెన్ పద్ధతి ప్రకారం కొనుగోలు చేయాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ పాల్గొన్నారు.

- వీర్నపల్లి మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు స్థానికులు విద్యుత్ సమస్యపై వినతి పత్రం అందించారు. అక్కడే ఉన్న అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ సెస్ ఏఈ, సెస్ ఏడీ ఉన్నారా? అంటూ అడుగుతుండగా వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఉన్న రెండు స్తంభాలను తొలగించాలని గతంలో ఆదేశాలు జారీ చేసినా సెస్ అధికారులు ఇంతవరకు తొలగించ లేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఫోన్ చేసినా స్పందించడం లేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా 'నేను చెప్పిన మాటనే వినడం లేదు ఇక మీ మాట వింటారా' అని అన్నారు. విషయం తెలుసుకున్న సెస్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లిలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ శుక్రవారం ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో డీసీవో రామకృష్ణ, తహసీల్దార్ భూపతి, సింగిల్ విండో చైర్మెన్ భూపతి సురెందర్, సెక్రటరీ రాజయ్య తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి అన్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట, లింగాపూర్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. వైస్ చైర్మన్ అంజిరెడ్డి, ఏపీఎం సుదర్శన్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిది పర్శ హన్మండ్లు, డైరెక్టర్లు గంగరాజుగౌడ్, విఠల్. మాజీ సర్పంచ్ పూజల భూమరాజం, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, గౌరిశంకర్, రమేష్, మహేష్, ఉపేందర్, దేవగౌడ్ ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు హరిదాస్‌నగర్, బొప్పాపూర్, అగ్రహారం, బండలింగంపల్లి, కిష్టునాయక్‌తండా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్ధతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో సత్తయ్య, ఏపీఎం మల్లేశం, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కిష్టారెడ్డి, రవీందర్, రాజేందర్, నారాయణరెడ్డి, గణపతినాయక్, బాలయ్య, గిరిధర్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన సిరిసిల్ల న్యాయవాదులు



హైకోర్టు న్యాయమూర్తితో న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్ తుకారంను హైకోర్టు చాంబర్‌లో సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావును కలిసి సత్కరించారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, కోశాధికారి బిట్ల విష్ణు, మ్యాక్ అధ్యక్షుడు గోవిందు బాస్కర్, మాజీ అధ్యక్షులు బాస్కర్‌రెడ్డి, ఆడెపు వేణు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల ఇన్‌చార్జి కరివెద మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కందికట్కూరులో శుక్రవారం సభ్యత్వాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల అభివృద్దే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందన్నారు. బీజేపీకి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వాల సేకరణలో ముందుకు పోవాలన్నారు. కష్టపడిన కార్యకర్తలకు పార్టీలో తగిన ప్రాధాన్యం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినుకొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా పరిశీలకుడు ఏలేటి చంద్రారెడ్డి, నాయకులు భూమల్ల ప్రశాంత్, తాళ్లపెల్లి కిషన్, భూమల్ల అనీల్, చదువాల రవి తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: బోయినపల్లి మండలం నర్సింగాపూర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ అన్ని వర్గాల ప్రజాలకు న్యాయం చేస్తున్నారన్నారు. బీజేపీ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

వర్షంతో నేలవాలిన వరి



చందుర్తిలో నేలవాలిన పంట

చందుర్తి,అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి వరి పంట నేలవాలింది, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరారు. గ్రామాల్లో వారం రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సంబంధిత అధికారులను కోరారు.

పెద్దలింగాపూర్ మీదుగా ఆర్టీసీ బస్సులు నడిపించాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామం మీదుగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని గ్రామస్థులు కోరారు. శుక్రవారం సిరిసిల్ల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. సిరిసిల్ల నుంచి జిల్లెల మీదుగా ఉదయం, సాయంత్రం బస్సు సర్వీసు నడుపాలని కోరారు. రామోజిపేట గ్రామం మీదుగా కూడా ఆర్టీసీ బస్సు నడిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అందుకు మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో అమ్ముల అశోక్‌యాదవ్, మాతిరెడ్డి రవీందర్‌రెడ్డి, కేతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కొడిముంజ రవీందర్, ల్యాగల బాగయ్య ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకపోతే పోరాటం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దళితులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం శాంతినగర్ 1983లో సర్వే నంబరు 246లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 277 మంది దళితుల ఇళ్ల నిర్మాణం కోసం తొమ్మిది ఎకరాల భూమిని ఇచ్చిందన్నారు. దళితులు ఇళ్లు నిర్మించుకున్నారని, వసతులు లేక అక్కడ ఉండలేక పోయారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళితులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని అప్పటి మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని, దళితులు త్యాగాలు చేయడంతో ఆ భూమిలో ప్రస్తుతం నర్సింగ్ కళాశాలను నిర్మించారని అన్నారు. దళితుల దగ్గర నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వం దళితులను నిర్వాసితులుగా చేసినట్లుగా సీపీఐ భావిస్తోందన్నారు. దళితుల భూముల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను దళితులకు ఇవ్వాలన్నారు. మిగిలిన ఇళ్లను అర్హులైన పేదవారికి వారికి కులంతో సబంధం లేకుండా కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, మీసం లక్ష్మణ్, మంత్రి చంద్రన్న, బాలరాజు, చంద్రం పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

వీర్నపల్లి, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ నిరంతరం పని చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానం రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మహేందర్ రావు, ఉపాధ్యక్షుడు అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చందుర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎన్గల్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వాసం ప్రసాద్ కుటుంబ సభ్యులకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉపాధ్యాయ సిబ్బంది రూ.5000 ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్రం కృష్ణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు

ఇల్లంతకుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగకు మహిళలు చీరల కోసం ఎదురుచూసినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. మాటలతో కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన హామీల మేరకు అమలు చేయాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈనెల 20న మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలో నిర్వహించనున్న అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, నాయకులు మోహన్‌రావు, మెరుగు రాజుగౌడ్, ఎంగ్ర చందన్, ఒర్సుల రాములు, కూనబోయిన రఘు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని అతి పురాతన దేవాలయమైన శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో శుక్రవారం జగిత్యాల డివిజన్ దేవా లయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి పర్యవేక్షణలో ఈవో విక్రం ఆధ్వర్యంలో హుండీ లెక్కింపును నిర్వ హించారు. హుండీ ఆదాయం రూ. 86,506 సమ కూరినట్లు దేవాలయ ఈవో విక్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో పురహితుడు నరసింహాచారీ, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, సిబ్బంది గంగాధర్, రాజేంధర్, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు, లక్ష్మి, ఇందిరా, భక్తులు ఎతిరాజం నర్సయ్య, ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

- పట్టణ శివారులోని సాయిబాబ ఆలయంలో దేవాలయ శాఖ జిల్లా పరివేక్షకుడు రాజమౌళి ఆధ్వ ర్యంలో భక్త సమాజం సభ్యుల పర్యవేక్షణలో హుం డీ లెక్కింపు నిర్వహించారు. హుండీ ఆదాయం రూ. 2,26,886గా సమకూరినట్లు దేవలయ శాఖ అధికా రులు తెలిపారు. ఎప్పడిలాగే మిశ్రమ బంగారంను హుండీలో ఉంచినట్లు దేవాలయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పురహి తులు రమేష్, కిరణ్‌లతో పాటు సాయిబాబ సేవా సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

చందుర్తి అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి) : గంజాయి తరలింపులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మండలంలోని మల్యాల శివారులో జూలై 1న చర్చి సమీపంలో గంజాయితో పట్టుబడిన వేములవాడకు చెందిన చేపూరి రోహన్‌తో పాటు ఇల్లంతకుంటకు చెందిన నవీన్, గోస్కులపల్లికి చెందిన అరుణ్, లింగంపేటకు చెందిన మ్యాకల రాహుల్‌పై కేసు నమోదైంది. అప్పుడు చేపూరి రోహన్ అరెస్టు చేసి రిమాండుకు పంపారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారు. లింగంపేట గ్రామానికి చెందిన మ్యాకల రాహుల్ శుక్రవారం శంషా బాద్ ఎయిర్‌పోర్టులో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి అరెస్ట్ చేశారు.

అంకితభావంతో పని చేయాలి

చందుర్తి అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన సేవలు గుర్తింపునిస్తాయని, అంకితభావంతో పని చేయాలని చందుర్తి సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కైరిక సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో నటరాజన్, ఎంఈవో వినయ్ కుమార్ , ప్రధానో పాధ్యాయులు శంకర్, మల్లేశం, రాములు, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో పోలీస్ బృందం

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడాలలో రాణించాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వ రరావు అన్నారు. ఈ నెల 21న పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో వాలిబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. సర్కిల్ ప రిధిలోని 10 గ్రామాలకు చెందిన క్రీడా కారులు వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొ న్నారు. డీఎస్పీ ఉమా మహేశ్వరరావు టో ర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా 21న పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా క్రీడలతో పాటు వివిధ సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆటలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు చిరంజీవి, అనిల్, కిరణ్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధుల మంజూరుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చందుర్తి, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం సనుగులలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుపై కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపటి రామస్వామి మాట్లాడుతూ సనుగులలో గ్రామ పంచాయతీ నుంచి గంగిరెడ్డుల కాలనీ వరకు సీసీ రోడ్డుకు కోటి రూపాయలు నిధులు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు ముకుంద రెడ్డి, సురేందర్, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుద్రంగి: రామకిష్టపూర్ పల్లె ఒర్రె వద్ద వంతెన నిర్మాణం దశాబ్దాల కల అని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. రుద్రంగి మండల కేంద్రం శివారులోని రామకిష్టపూర్ పల్లె వద్ద లోలెవల్ వంతెన నిర్మాణం కోసం, రుద్రంగిలోని రింగ్ రోడ్డు నిర్మాణం కోసం రూ. రెండు కోట్ల 12 లక్షల నిధులు మంజూరు కావడంతో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగానర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సరెడ్డి, తర్రె లింగం, బొల్లి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సభ్యులు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అమ్ముకున్నారా?



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం శాంతినగర్ శివారులోని దళితుల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అమ్ముకున్నారా? అని, తమకు కేటీయించాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వార్డులోని పేదలకు చీటీలు రాసి పంపించడంలో అంతర్యం ఏమిటని అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ ప్రశ్నించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం శాంతినగర్ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయం సిరిసిల్ల ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. 1976-77లో కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లకు చెందిన మాలమాదిగ సామాజిక వర్గం ప్రజలకు ఇందిరమ్మ పథకంలో దాదాపు 12 ఎకరాల భూమి ఇచ్చిందన్నారు. మా పూర్వికులు బేస్మిట్ వరకు నిర్మించారన్నారు. హడ్కో స్కీం ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. దళితవాడ కావడంతో అభివృద్ధికి నోచుకోలేదని, డ్రైనేజీ నిర్మాణం లేకపోవడం, కాలనీకు విద్యుత్ సరఫరా లేకపోవడం, తాగునీటి సమస్యలు తలెత్తడం వంటివాటితో ఇళ్లలో ఉండలేక పోయారని వివరించారు. సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వాలను కోరినా ఫలితం లేకుండా పోవడంతో ఇళ్లు ఖాళీ చేశారని న్నారు. రగుడు బైపాస్ రోడ్డు ఏర్పడడంతో అక్కడి భూములకు విలువ పెరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేటీఆర్ కన్ను మా భూములపైన పడిందని దళితులు అక్కడ ఉండడం తనకు ఇష్టం లేక ఓర్వలేక పోయాడని ఆరోపించారు. మమ్మల్ని పిలిపించి ఈ భూమిలో నర్సింగ్ కళాశాల, అంబేద్కర్ భవనం కడతాం మీ అందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఒప్పించాడన్నారు. మాకోసం కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను మాకే ఇవ్వాలని మొదటి నుంచి కోరుతూ వస్తున్నామన్నారు. నాయకులు బాలరాజు, లక్ష్మన్, కిరణ్, బాలకిషన్, గడ్డం హనుమంతు, కొమ్ము త్యాగరాజు, నారాయణ, రవి, కిష్టయ్య పాల్గొనున్నారు.